# అవిభాజ్యం

అవి 1947 ఆగస్టు చివరి రోజులు.

అప్పటికి రాత్రి పదకొండు గంటలయి ఉంటుంది.

రాంపూర్ సద్దుమణిగింది. పంజాబ్ సరిహద్దు గ్రామాల్లో అదొకటి.

దూరంగా ఎక్కడో కుక్కలు మొరుగుతున్న శబ్దాలు. వాటికి తోడు కీచురాళ్ళ శబ్దం.

❀❀❀

హైమకు నిద్రపట్టడం లేదు. ఆమె కొడుకు పదినెలల పసికందు ఆదమరచి నిద్రపోతూ ఉన్నాడు.

ఆమె భర్త అరుణ్‌సింగ్ అరగంట క్రితమే ఒక రహస్య సమావేశం కోసం వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు తలుపుల్ని భద్రంగా వేసుకొని, గడియ పెట్టుకోమని కూడా చెప్పి పోయాడు. అందుకు కారణం, ఒక వారం రోజుల కిందటే రాంపూర్‌లోనే ఒక ఇంట్లో మగవాళ్ళని కొట్టి చంపేసి, అయిదుగురు ఆడవాళ్ళని ఎత్తుకుపోయారు పాకిస్తాన్ వాళ్ళు. అప్పటినుంచి అట్టుడికిపోతూ ఉంది ఊరంతా. కొంతమంది యువకులు రాత్రిళ్ళు గస్తీ తిరుగుతున్నారు కూడా.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని మురిసీమురవక ముందే ఇటు భారతదేశం, అటు పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాలలో ఉంటున్న ప్రజలు భద్రతారాహిత్యంతో అనుక్షణం భయవిహ్వలులై బతుకుతూ ఉన్నారు. పాకిస్తాన్ యువతుల్ని తాము కూడా ఎత్తుకువచ్చి దెబ్బకి దెబ్బ తీయాలన్న నిర్ణయాన్ని తీసుకోవడానికే ఆ రోజు రాత్రి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు ఆ గ్రామంలోని యువకులు.

బయట ఉండి ఉండీ వర్షం కురుస్తోంది.

ఎందుకైనా మంచిది, భర్త ఇంటికి చేరేవరకూ మెలకువతో ఉండాలన్న నిశ్చయంతోనే మేలుకునే ఉంది హైమ. ఆమె మనసు ఎందుకో గుబులు గుబులుగా ఉంది. ఏవేవో ఆలోచనలు తలలో

ముసురుకుంటున్నాయి.

సాయంత్రం అరుణ్‌సింగ్ అన్నమాటలు జ్ఞాపకానికి వచ్చాయి హైమకు.

"మేం కూడా ఆ పుండాకోర్ల పెళ్లాల్నీ, చెల్లెళ్ళనీ ఎత్తుకొస్తాం. అప్పుడు తెలుస్తుంది ఆ దగుల్బాజీలకు మా సత్తా ఏమిటో" అన్నాడతను వీరావేశంతో.

"వాళ్ళు దుర్మార్గులై నీచమైన పనికి ఒడిగడితే అంత నీచమైన పనే మీరూ చేయాలా? ఇంక వాళ్ళకీ, మీకూ తేడా ఏముందండీ" అంది హైమ.

"ముల్లుని ముల్లుతో తీయాలన్నదే మా సిద్ధాంతం" అంటూ అరుణ్‌సింగ్ పళ్ళు పటపట కొరికాడు.

"ఏమో, నాకు మాత్రం ఏం బాగనిపించడం లేదు. అసలూ - దేశాల మధ్య ద్వేషాలుంటే, కోపాలుంటే యుద్ధాలు చేసుకోవచ్చు, మరేమైనా చేసుకోవచ్చు గానీ, ఇట్లా ఆడవాళ్ళని ఎత్తుకుపోవడాలు ఏమిటీ" అంది హైమ.

"అదంతే నువ్వు ఆడదానివి. నోరు మూసుకుని పడివుండు. మా సంఘం వాళ్ళు ఏ నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండడం నా ధర్మం. నేను పొరపాట్న నీకు చెప్పాను, ముందు నీ పని నువ్వు చూసుకో పో" అని గదమాయించాడు అరుణ్‌సింగ్.

వర్షం ఆగిపోయింది.

ఎవరో కొట్టినట్టు గొల్లున ఏడవడం మొదలుపెట్టాడు హైమ కొడుకు. వాడిని తన వైపుకి తిప్పుకుని ఓదారుస్తూ పాలు తాపడం ప్రారంభించడంతో వాడు ఏడుపు మానేసి పాలు తాగుతూ ఉన్నాడు. అప్పుడు వాడిలోని ఆత్రాన్నీ, కళ్ళు మూసుకునే తన రెండో వక్షాన్ని తడమటాన్నీ గోడకున్న బుడ్డీ దీపపు వెలుతుర్లో మురిపెంగా చూస్తోంది హైమ.

ఇంటి బయట ఎవరో కొందరు పరిగెత్తి వస్తున్నట్టు చప్పుడు వస్తోంది. చెవులు రిక్కించి వింది ఆమె. ఆ శబ్దం మరింత దగ్గరయింది. ఎందుకో ఆమె మనసు కీడునే శంకిస్తోంది. అరుణ్‌సింగ్ త్వరగా ఇంటికొస్తే బాగుండును.

ఉన్నట్టుండి తలుపు 'ధన్ ధన్' మంటూ చప్పుడైంది.

హైమ ఉలిక్కిపడింది.

ఆమె గుండెలు దడదడలాడాయి.

ధన్ .. ధన్ .. ధన్.

"తలుపు తెరూ" అంటూ ఒక మగ గొంతు గర్జించింది ఉర్దూలో.

"తెరిచారా సరి, లేదంటే తలుపులు విరగ్గొట్టి లోపలికి రావాల్సి వుంటుంది. తలుపులు 'ధన్ ధన్'

మంటూ కొడుతూనే ఉరిమింది మరో కంఠం.

అమాయకంగా, ఆత్రంగా పాలుతాగుతున్న బాబు ఉలిక్కిపడి కళ్ళు తెరిచి తల్లి కేసి చూస్తూ ఉన్నాడు.

బయటి కేకల్ని, గర్జనల్నీ, భాషని బట్టి వాళ్ళు కచ్చితంగా పాకిస్తాన్ వాళ్ళే అయ్యుంటారు అనుకుంది. అలా అనుకునేటప్పటికి మరింత భయపడిపోయిందామె. అప్పుడేం చేయాలో పాలుపోవడం లేదు.

ఏ క్షణంలోనైనా తలుపులు విరగ్గొట్టి వాళ్ళు లోపలికి రావచ్చు. తాను ఎక్కడికి వెళ్ళగలదు!

తలుపులు బాదుతున్న శబ్దం మరీ ఎక్కువైపోయింది.

కొద్ది క్షణాలలోనే 'ఫెళ ఫెళ'మంటూ తలుపులు విరిగిపోయాయి.

ఆరుగురు యువకులు లోపలికి వచ్చేశారు. అందరి తలలకూ పాగాలున్నాయి. పొడుగాటి చొక్కాలూ, పైజామాలూ ధరించారు. అందరి చేతుల్లోనూ పొడుగ్గా మెరిసిపోతూ ఉన్న కత్తులున్నాయి.

హైమ వాళ్ళని చూడగానే కంపించిపోయింది. భయంతో ఒక మూలన నక్కి బాబును గుండెలకి హత్తుకుని భయం భయంగా చూస్తోంది. బాబు పాలు తాగుతూనే ఉన్నాడు.

"ఏమే గుడ్లు మిటకరించి చూస్తున్నావ్? నీ మొగుడు ఏడీ" అంటూ లావు మీసాలవాడు పెద్ద గొంతుతో అడిగాడు పంజాబీలో.

"అది చూడరా ఎట్లా వణికిపోతోందో. ఏమే సుందరాంగీ మూగదానివా? మాటలు రావా? ఎక్కడ నీ మొగుడు" అన్నాడు గుంత కళ్ళు ఉన్న పొడుగాటి యువకుడు భేతాళుడిలా నవ్వుతూ.

హైమ బెదురు చూపులు చూస్తోందే కానీ గొంతు పెగలడం లేదు.

"ఊఁ చెప్పవే" అంటూ లావు మీసాలవాడు గద్దించాడు.

"తె తె తె ... తెలీదు" అంది తడబడుతూ హైమ. ఇంట్లో మరెవరైనా ఉన్నారేమోనని ఇద్దరు యువకులు ఇల్లంతా కలయదిరిగారు. ఎవరూ లేరని నిర్ణయించుకున్నాక హైమ ముందు నిలబడ్డ వాళ్ళకి తెలియజేశారు.

"రేయ్, దీనితో మాట్లాడుతూ ఉంటే తెల్లవారి పోతుందిరా! పిట్ట బలే బాగుంది. దీన్ని తీసుకుపోదాం పద" అంటూ గుంతకళ్ళవాడు హైమని సమీపించాడు.

"నీ నీ నీ.. నీకు దండం పెడతాను. దగ్గరికి రావద్దు. నన్నేం చెయ్యొద్దు" అంటూ బాలుని భుజం మీదకి వేసుకుని రెండు చేతులూ జోడించింది అతి కష్టం మీద.

ఆమె బేలతనం చూస్తూ ఉంటే లావు మీసాల వాడికి మరింత ఉత్సాహంగా అనిపించింది. జోడించిన చేతుల్ని పట్టుకుని బలవంతంగా లాగాడు.

"నన్ను వదిలెయ్యండీ, నన్ను వదిలెయ్యండీ. మీ పాదాలు పట్టుకుంటాను" అంటున్న ఆమె గొంతు కీచుపోయింది.

"రహ్మాన్! ముందు ఆ బిడ్డని లాక్కోండి" అంటూ అరిచాడు బక్కగా ఉన్న యువకుడు గడ్డం మీసాలున్నతన్ని ఉద్దేశించి.

అన్నదే తడవుగా హైమ నుంచి బిడ్డని లాగేసుకున్నాడు రహ్మాన్. బిగ్గరగా ఏడుస్తున్నాడు బాబు.

"వాణ్ణేం చేయకండి, వాణ్ణేం చేయకండి" అంటూ హైమ అరిచింది ప్రాధేయపడుతూ.

"నువ్వు చెప్పినట్టు చేయడానికి మేం ఆటబొమ్మలమా" అంటూ గుంతకళ్ళవాడు రహ్మాన్ చేతుల్లోంచి బిడ్డని లాక్కుని గోడకేసి విసిరాడు. గోడకి తగిలిన బాబు గిలగిలమంటూ తన్నుకున్నాడు. ఏడుపు ఆగిపోయింది. చలనం కూడా ఆగిపోయింది.

"బాబూ" అంటూ అరిచింది హైమ దిక్కులు ప్రతిధ్వనించేలా. వెంటనే ఆమె నోరు మూసేసి, వెంట్రుకవాసి కూడా ముందుకు పోకుండా ఒడిసి పట్టుకున్నాడు లావు మీసాలవాడు.

అంతవరకూ ఏమీ మాట్లాడని రహ్మాన్ తన చేతుల్లోంచి బిడ్డని లాక్కుని విసిరినది చూసి సహించలేక గుంతకళ్ళవాడిపై కేకలు వేశాడు. "రేయ్ యాకూబ్! ఆ బిడ్డని ఎందుకు చంపావ్! బుద్ధి లేదూ బద్మాష్! ఆ పసివాడేం చేశాడు ? వాడి మీద నీకెందుకు ద్వేషం! మీరిట్లాంటి కసాయి పనులు చేసేటట్టయితే మీ నుంచి తప్పుకుంటాను."

"ఏమిరా కూశావ్! నేను బద్మాష్‌నా, నిన్ను కూడా చంపేస్తాన్ సాలే!" అంటూ యాకూబ్ కత్తి ఎత్తాడు రహ్మాన్ మీద. కోపంతో రెచ్చిపోయిన రహ్మాన్ కూడా కత్తి దూశాడు.

తాము వచ్చిన పని తారుమారయ్యేలా ఉందని గ్రహించిన నలుగురు యువకులూ, వాళ్ళిద్దర్నీ చెరొక వైపు పట్టుకున్నారు. లావు మీసాలవాడు ఇద్దర్నీ ఉద్దేశించి, "దయచేసి శాంతించండి. ఇది పంతాలకీ, కోపతాపాలకీ సమయం కాదు. యాకూబ్ చేసింది తప్పే అయినా, అది వ్యక్తిగతమైనది కాదు, దేశానికి సంబంధించింది. కాబట్టి! రహ్మాన్, ఇట్లాంటి చోట్ల నీ అంత మంచితనం, మానవత్వం పనికిరాదు. ఇక్కడ ఆరుగురం ఏం చేస్తే అది ఒప్పు. ఏదీ తప్పు కాదు. వెళ్దాం పదండి. దీన్ని తీసుకురండి" అన్నాడు.

హైమ నోట్లో గుడ్డలు కుక్కారు- గట్టిగా అరవకుండా. మౌనంగా రోదిస్తోందామె. కళ్ళనీళ్ళు ధారాపాతంగా పొంగి పొరలుతున్నాయి.

❀❀❀

చుట్టూ చీకటి. వాన తుంపరగా పడుతూనే ఉంది.

హైమ కళ్ళల్లో నీళ్లు ఆగడం లేదు. ఆమెను బలవంతంగా పొలాల్లో పాకిస్తాన్ వైపు లాక్కుపోతున్నాడు గుంతకళ్ళ యాకూబ్. తక్కిన అయిదుగురూ అనుసరిస్తున్నారు. కొద్ది దూరంలో ఒక వ్యాను నిలబడి ఉంది. అక్కడికి పోతూనే హైమను వ్యానులోకి ఎక్కించారు. ఆ వ్యానులో హైమ ఈడువాళ్ళు ఇరవైమంది ఉన్నారు. వాళ్ళందరి నోళ్ళలో గుడ్డలు కుక్కి ఉన్నాయి. వ్యానులో వెలుగుతోన్న చిన్న బల్బు వెలుతుర్లో భయం భయంగా ఒకర్నొకరు చూసుకున్నారు.

పాకిస్తాన్ వైపు కదిలింది వ్యాన్

## 2

ఉదయం ఎనిమిది గంటలవుతోంది.

హైమతో పాటు తెచ్చిన ఇరవైమంది ఆడవాళ్ళనూ, ఆ పట్టణం చివర్లో ఉన్న ఒక పెద్ద భవంతి ఆవరణలో చెట్టు కింద నిలుచోబెట్టారు. వాళ్ళ చుట్టూ రెండు వందలమంది నడివయస్కులూ, యువకులూ గుంపుగా చేరి ఉన్నారు. వజీర్‌సాహేబ్ వాళ్ళందరికీ నాయకుడు. అక్కడ అతని మాటకు తిరుగులేదు. భారతదేశం నుంచి తెచ్చిన యువతుల్ని, అతను ఎవర్ని తీసుకెళ్ళమంటే వాళ్ళని తీసుకెళ్ళాల్సిందే! అయితే, అతనికి రహ్మాన్ మీద ప్రత్యేకమైన అభిమానం. ఆ అభిమానానికి కారణం రహ్మాన్ తండ్రి వజీర్ సాహేబ్‌కి ప్రాణస్నేహితుడు అవడమే! అందుకే రహ్మాన్‌ని ముందుగా కోరుకోమని అన్నాడు ఆడవాళ్ళందర్నీ చూపిస్తూ. రహ్మాన్ ఒక్కసారి వాళ్ళందర్నీ చూసి హైమని కోరుకున్నాడు. రాత్రి ఆమె కొడుకు చనిపోయినప్పుడు పెట్టిన కేక ఇంకా అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. తాను కాకుండా మరొకరు ఎవరైనా ఆమెను తీసికెళితే చిత్రహింసలు పెడతారేమోనన్న సందేహం ఉన్నందువల్లే హైమను కావాలన్నాడు. ఆ తర్వాత తక్కిన ఆడవాళ్ళని ఒక్కో యువకునికి పంపకం చేశాడు వజీర్‌సాహెబ్.

❀❀❀

రహ్మాన్ ఇంటికి వచ్చాక హైమ ఒంటరిగా ఒక గదిలో ఉండిపోయింది. పనిమనిషి భోజనం తెస్తే 'వద్దు' అన్నది. అప్పటికి రెండు రోజులైంది ఆమె భోజనం చేయక. మూలలో ఉన్న కూజాలో నీళ్ళు తాగి మంచం పైన ముడుచుకుని పడుకుంటూ ఉంది. చనిపోయిన బాబు పదే పదే గుర్తుకువస్తున్నాడు ఆమెకు.

ఎలాగైనా అక్కడి నుంచి పారిపోదామా అని ఆలోచించింది. అట్లా పారిపోయి తన ఇల్లు చేరుకుంటే పరాయివాళ్ళు ఎత్తుకుపోయిన ఆడదాన్ని తన భర్త ఏలుకుంటాడా? అసలే పాడు అనుమానం మనిషి. అతని స్నేహితులు ఇంటికొచ్చినప్పుడు వాళ్ళతో మాట్లాడినందుకు బాగా కొట్టేవాడు. ఎప్పుడైనా అతను ఇంటికి రావడం ఆలస్యమైతే ఇంటి బయట ఎదురు చూస్తూ కూర్చుంటే, ఎవరితోనో అక్రమ సంబంధం ఉన్నందువల్లే తాను అక్కడ కూర్చుందని ఎముకలు విరిగేలా తన్నేవాడు. అట్లాంటి మనిషి

తనని మామూలుగా చూసుకుంటాడా అన్న సందేహం ఆమె బుర్రని తొలిచేస్తోంది.

"నువ్వు అన్నం తినవా? ఆకలిగా లేదా?" అంటున్న లేత గొంతు ఎవరిదా అని తలెత్తి చూసింది హైమ. ఆరేళ్ళ పసిపాప తెల్లగా బొమ్మలా ఉంది. గులాబీ రంగు షేర్వాణీ, పైజామా వేసుకుని ఉంది. సురమా పెట్టిన పెద్ద పెద్ద కళ్ళతో, ఎర్రటి లేత పెదవులతో ముద్దులొలుకుతూ ఉంది. చిత్రంగా చూసింది పాపని.

"నీకు ఆకలిగా లేదా? మొన్నటి నుంచి అన్నం తినలేదటగా" అంది పాప.

పసిపాప మాటలకు కళ్ళు చెమ్మగిల్లాయి హైమకు.

"నువ్వు ఎవరమ్మాయివి?" అడిగింది హైమ. తన గొంతు తనకే ఎట్లాగో అనిపిస్తూ ఉంది.

"నేను రహ్మాన్‌గారి అమ్మాయిని. నా పేరు హసీనా. అయితే అందరూ నన్ను 'మున్నీ' అనే అంటారు" అంది చక్రాల్లాంటి కళ్ళు తిప్పుతూ.

పాపతో మాట్లాడుతూ ఉన్నప్పుడే ఒక ముసలావిడ వచ్చింది. తలంతా ఇంచుమించు నెరిసిపోయింది. హైమ వైపు నవ్వుతూ చూసి, "నీకొచ్చిన కష్టం మా పెద్దాడు రహ్మాన్ చెప్పాడమ్మా. అది వింటూనే నా కడుపు తరుక్కుపోయింది. మా దేశం వాళ్ళు అంత క్రూరంగా ప్రవర్తించినందుకు నేను సిగ్గుపడుతున్నాను. మా వాడు నీకు జరిగిన అన్యాయం చూశాక వెంటనే ఆ యాకూబ్ గాడిని కోప్పడి తిట్టాడంట. మా రహ్మాన్ బలే సున్నితమైన మనిషమ్మా. వాడికి ఇట్లాంటివన్నీ నచ్చవు. ఇంకెప్పుడూ అట్లాంటి పనులకు పోకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఇక్కడ నీకు ఏ ఇబ్బందీ ఉండదు. ఈ ఇంట్లో నేనూ, వాడూ, ఈ పిల్లా తప్ప ఎవ్వరూ లేరు. ఇంక నా రెండో కొడుకు హైదరాబాద్‌లో ఉద్యోగి. ఎప్పుడోగానీ రాడు వాడు. ఈ 'మున్నీ' ఒక్కతే మా వాడి కూతురు. దీని తల్లి రెండేళ్ళ కిందట విషజ్వరంతో చనిపోయింది. నువ్వు రెండు రోజుల్నించీ అన్నం తినలేదు. నీరసం వస్తుందమ్మా. అట్లా ఉండకు, కాస్తన్నా ఎంగిలి పడు. నువ్వు భోంచేయకపోతే మావాడు నన్ను తిడతాడు" అంటూ పక్కకి చేరి ఆమె తల మీద చేయి వేసి అక్కున చేర్చుకుంది ముసలావిడ. ముసలావిడ మాటలు వింటుంటే ఏదో తృప్తిగా, ఓదార్పుగా ఉంది. ఆవిడ మాటల్లోని మార్దవం, ఆత్మీయతా, లాలనా, బుజ్జగింపు తన తల్లిని గుర్తుకు తెచ్చేలా ఉన్నాయి. తన కళ్ళల్లో నీళ్ళు మరింత ఎక్కువయ్యాయి.

"తినమ్మా" అంటూ గోధుమ రొట్టెలూ, కూరా ఉన్న ప్లేటుని దగ్గరకు తెచ్చింది పాప. తినక తప్పలేదు హైమకు.

వారం తిరిగేలోపు పాప మరీ దగ్గరయింది. ముసలావిడ హైమని కంటికి రెప్పలా చూసుకుంటోంది. రహ్మాన్‌ది బంగారు నగల వ్యాపారం. రోజుకోమారు ఉదయం పూట కనిపిస్తాడతను హైమకు. "బావుందా నీ ఒంట్లో? ఏం దిగులు పెట్టుకోకు. హాయిగా అమ్మతోనూ, అమ్మాయితోనూ ఉండు" అన్న మాటల్నే

కాస్త అటుఇటుగా మాట్లాడేసి వెళ్ళిపోతుంటాడు. ఇంక రాత్రి ఎప్పుడు ఇల్లు చేరుకుంటాడో తెలీదు. తన భర్త అరుణ్‌సింగ్, చనిపోయిన బాబూ ఎప్పుడూ జ్ఞాపకానికి వస్తూనే ఉన్నారు. ఇంక తన దేశానికి పోయి మామూలుగా భర్తతో కాపురం చేసుకోవడం కలలో మాట. మరి ఎందుకు బతకాలి తాను?

ఈ రహ్మాన్, ఈ ముసలావిడా తనని ఇంత బాగా ఎందుకు చూసుకుంటున్నారు? తనని లొంగదీసుకొనే ప్రయత్నమా? ఏమో!

తాను చావనైనా చస్తుందిగానీ రహ్మాన్‌కి మాత్రం లొంగదు. పోనీ, లొంగినట్టు నటించి మా దేశానికి పంపించమని కోరితేనో... ఒప్పుకుంటాడా రహ్మాన్? ఏది జరిగినా, జరక్కపోయినా తన భర్త ఒప్పుకోవద్దూ? అది జరిగే పనేనా ? ఇట్లా ఏవేవో ఆలోచనలు.

ఇంటి పనుల్లో ఇప్పుడు తానూ భాగం పంచుకుంటోంది హైమ. ఉదయాన్నే నాస్తానీ, టీని తయారు చేయడం, వాటిని రహ్మాన్‌కి అందుబాటులో ఉండేలా అతని గదిలో పెట్టి రావడం చేస్తోంది.

ఒకరోజు ఉదయం టీ తీసుకుని వెళ్ళింది హైమ. అప్పటికే నాస్తా ముగించుకుని చేయి కడుక్కుంటున్నాడు రహ్మాన్. టీ కప్పు అతని పక్కనే పెట్టి వెనుతిరిగిందామె.

"హైమా" అంటూ పిలిచాడు రహ్మాన్.

టక్కున నిలబడిపోయిందే కానీ 'ఊ' అనలేదు.

"ఒక్క మాట హైమా, ఇట్లా వచ్చి కూర్చో".

మరబొమ్మలా యాంత్రికంగా అతని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది. చూపులు మాత్రం నేలమీదే ఉన్నాయి. ముసుగును మరింత మొహం మీదకి లాక్కుంది.

"నువ్వు మరోలా భావించకుంటే ఒక్క మాట అడుగుతాను హైమా! మున్నీని చూశావు కదా. అది తల్లి లేని పిల్ల. నేను మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఎందుకో తెల్సా? దాన్ని సరిగ్గా ప్రేమతో చూసుకుంటుందో లేదో ఆ వచ్చే ఆవిడ అని. నువ్వు పాపను తల్లి కంటే మిన్నగా చూస్తున్నావు! నీకిష్టమైతే నిన్ను నాదాన్ని చేసుకుంటాను. లేదంటే నువ్వు ఇలాగే ఉండొచ్చు. నీ మతాన్ని మార్చుకోమని గానీ, మరింకేంగానీ నిన్ను అడగను. మీ దేశానికి వెళ్ళిపోవడం ఎట్లానూ జరిగే పని కాదు. మంచయినా, చెడ్డయినా అంతా నేనే నీకు" అంటూ నెమ్మదిగా చెప్పాడు రహ్మాన్.

ఎందుకో ఏడుపు వచ్చేసింది హైమకి. కళ్ళల్లో నీళ్ళు ఆగలేదు. వాటిని తుడుచుకుంటూ ఉంటే, రహ్మాన్ మనసు చలించిపోయింది.

"నిన్ను నొప్పించినందుకు క్షమించు హైమా" అనేసి అతను అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ రోజు నుంచీ రహ్మాన్ తనతో మరింత సున్నితంగా వ్యవహరిస్తున్నట్టు గమనిస్తోంది హైమ. ముసలావిడ రహ్మాన్ గురించి వీలు దొరికినప్పుడల్లా పొగడుతూనే ఉంటోంది. ముందు ఎబ్బెట్టుగా అనిపించినా, ఇప్పుడతని ప్రవర్తన చూశాక ఆ పొగడ్తలకి తగినవాడే అనుకొంది.

## 3

దాదాపు నెల రోజులు గడిచిపోయాయి.

ఆవేళ సాయంత్రం రహ్మాన్ దగ్గర బంధువుల పెళ్ళికని ఇంటిల్లిపాదీ వెళ్ళాల్సి వచ్చింది. తాను రానంది హైమ. 'అయితే నేనూ వెళ్ళను' అంది ముసలావిడ. పాప తానూ వెళ్ళనంది. 'మీరెవ్వరూ వెళ్ళకపోతే నేనూ వెళ్ళను' అన్నాడు రహ్మాన్. తన నుంచి బంధువుల్లో రహ్మాన్‌కి చెడ్డపేరు వస్తుందేమోనని, 'సరే వస్తాలే' అంది. అంతే, ముగ్గురి మొహాలూ సంతోషంతో వెలిగిపోయాయి. అప్పుడు అందరూ బయల్దేరారు. తనకి అంత ప్రాముఖ్యతనివ్వడం, తనని అంత గౌరవంగా చూడడం ఎందుకో బలే సంతోషం అనిపించింది హైమకు. తీరా గడప దాటి తలుపులు వేస్తుంటే, ముసలావిడ కాసేపు ఆగమన్నట్టు చేత్తో సైగ చేసి ఇంట్లోకెళ్ళి నిమిషంలో వచ్చేసింది చేతిలో చిన్న కుంకుమ భరిణెతో. 'బొట్టు పెట్టుకుని రా' అన్నట్టు సంజ్ఞ చేస్తూ. తనకు తెలిసిన హిందూ కుటుంబం నుంచి హైమ కోసమే దాన్ని తెచ్చినట్టు చెప్పింది. ఆనందంతో హైమ కళ్ళు చెమర్చాయి. హైమ బొట్టు పెట్టుకున్నాక నలుగురూ టాంగాలో బయల్దేరారు. పెళ్ళింటికి చేరుకునేటప్పటికి చీకటి పడిపోయింది. అందరూ పెళ్ళి సందట్లో కలిసిపోయారు. మున్నీ మాత్రం తనతోనే ఉంది. ముసలావిడ ఎవరితోనో కబుర్లాడుతూ బయటి గదిలోనే ఉండిపోయింది.

ఉన్నట్టుండి రహ్మాన్ వచ్చి 'హైమా! నీకో అమ్మాయిని చూపిస్తా. ఆమెను చూస్తే నువ్వు చాలా సంతోషిస్తావు' అన్నాడు నవ్వుతూ.

'ఎవరూ' అంది ప్రశ్నార్థకంగా అతని వైపు చూస్తూ. 'ఎవరై ఉంటారా' అని హైమలో ఉత్కంఠ మొదలైంది.

'అదో' అన్నాడు ఎడమవైపు చూపిస్తూ. ఒక ముసలాయన వెంట వస్తోంది తన ఈడు అమ్మాయి. తీరా దగ్గరికొచ్చాక చూస్తే ఆమె ఎవరో కాదు వాళ్ళ ఊరి అమ్మాయే - రజని. ఆమెతో హైమకు కొద్దిపాటి పరిచయం ఉంది అంతే. ఇప్పుడు ఆమెని చూస్తే ప్రాణం లేచివచ్చింది. 'బాగున్నావా రజనీ? నిన్ను కూడా..." అంది హైమ అర్థోక్తిగా. తానూ కిరాతకానికి బలైపోయిన మనిషినే అన్నట్టు తల ఊపింది రజని. రహ్మాన్ వాళ్ళిద్దర్నీ కలిపాక, మరింత మనసు విప్పి మాట్లాడుకునేందుకు వీలుగా అక్కడి నుంచి ముసలాయన్ని తీసుకుని వెళ్ళిపోయాడు. హైమా, రజనీలు ఒకర్నొకరు పరామర్శించుకున్నాక, ఆ దేశంలో వాళ్ళని ఎట్లా చూస్తున్నదీ మాట్లాడుకున్నారు. రజనీ తన గురించి

చెబుతున్నప్పుడు ఏడుపు ఆపుకోలేకపోయింది. తాను ఉంటున్న ఇల్లు నరక కూపమనీ, ఆ ఇంటి యజమాని తనని కేవలం ఒక భోగ వస్తువుగానే వాడుకుంటున్నాడనీ, తాను ఏమాత్రం అతనంటే విముఖత చూపించినా చిత్రహింసలు పెడతాడని ఏకరువు పెట్టింది రజని.

అక్కడి నుంచి ఇంటికి వచ్చాక కూడా రజనీ పడుతున్న బాధే తనని వెన్నాడుతోంది. అప్పటికి తెలిసింది రహ్మాన్ ఇంట్లో తనని ఎట్లా చూస్తున్నదీ. దాంతో ఆమెకు రహ్మాన్ పట్లా, ముసలావిడ పట్లా మరింత గౌరవం పెరిగింది.

## 4

ఒకరోజు ఉదయమే ముసలావిడతో బయటి గదిలో ఎవరో ఆడమనిషి మాట్లాడుతున్నట్టు అనిపించి తొంగి చూసింది వంటింట్లోంచి హైమ. పదహారేళ్ళ అమ్మాయి ఆకుపచ్చని చుడీదార్ వేసుకుని నిలుచునే నవ్వుతూ మాట్లాడుతోంది. తెల్లటి ఒళ్ళు, కోలమొహం. ఎంత బాగుందో అనుకుంది హైమ. మరింత తేరిపారి చూసింది. నుదుటి మీద కుంకుమ బొట్టు ఎర్రగా ఉంది.

భారతదేశం నుంచి ఎవరైనా వచ్చారేమోనని ఆశగా పరుగులాంటి నడకతో బయటి గదిలోకి వెళ్ళింది. ముసలావిడ నవ్వుతూ ఇద్దర్నీ ఒకరినొకరికి పరిచయం చేసింది. అప్పుడు తెలిసింది ఆ అమ్మాయి పేరు సురేఖ అని. ఆమెది పాకిస్తానే అని తెలుసుకుని ఆశ్చర్యపోయింది హైమ. ఈ దేశంలోనూ హిందువులున్నారా అనుకుంది.

సురేఖ మంచి మాటకారి అని తెలుసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు హైమకి. రహ్మాన్ కుటుంబానికీ, సురేఖ కుటుంబానికీ మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయనీ, రహ్మాన్ తనని చెల్లెల్లా చూసుకుంటాడనీ, తాను రెండు నెలలుగా రావల్పిండిలోని వాళ్ళ అన్నయ్య దగ్గర ఉన్నందువల్లే ఆ ఇంటికి రాలేకపోయిందనీ, ఆ రోజు ఉదయమే ఆ ఊరు వచ్చిందనీ, పక్క వీధిలోనే వాళ్ళ ఇల్లు ఉందనీ - ఇలా ఎన్నో విషయాలు ఆ కాసేపటిలోనే హైమకు చెప్పేసింది సురేఖ.

ఎడారిలో ఒయాసిస్సులా సురేఖతో స్నేహం మరింత ఆనందాన్ని ఇచ్చింది హైమకి.

## 5

ఆవేళ సాయంత్రం ఇంట్లోకి పెట్టే బేడతో దిగాడు సూటు బూటు వేసుకున్న శాల్తీ. ఇంట్లో అందరూ సంతోషించారు. అతను రహ్మాన్‌ను 'అన్నయ్య' అనీ, ముసలావిడను 'అమ్మా' అని అంటుంటే, హైదరాబాద్‌లో ఉంటోన్న రహ్మాన్ తమ్ముడు 'అయూబ్' అని గ్రహించింది హైమ.

హైమని అతనికి పరిచయం చేస్తోంటే ఆశగా, తినేసేలా చూశాడు అయూబ్. అతని చూపుతోనే ఆమెకు ఒళ్ళంతా తేళ్ళూ, జర్రులూ పాకినట్టు అనిపించింది. రాత్రి పడుకోబోయేటప్పుడు ముసలావిడ అయూబ్ గురించి చెప్పింది. అతను హైదరాబాద్‌లో ఉన్న ఒక స్కూల్లో ఇంగ్లీషు టీచరుగా ఉద్యోగం

చేస్తున్నాడనీ, పెళ్ళాం, పిల్లలూ హైదరాబాదులోనే ఉంటారనీ.

మరుసట్రోజు నుంచీ అయూబ్ ఉంటున్న గది ఛాయలకొూడా వెళ్ళకుండా జాగ్రత్తపడింది హైమ. వంటింట్లో తాను కూరగాయలు తరుగుతూ ఉంటే, 'సాయపడనా' అనడిగాడు అయూబ్ ఒక రోజు ఉదయం. 'వద్దు' అనేసి ఊరకుండిపోయింది హైమ. ఏమనుకున్నాడో ఏమో వెంటనే అక్కడి నుంచి వెళ్ళిపోయాడు అతను.

రాత్రి పాప నిద్రపోయింది. మరో గంటకి గానీ రహ్మాన్ రాడు. రహ్మాన్ గదిలో పరుపు వేయాలని వెళ్ళింది హైమ. ఎప్పుడొచ్చాడో అయూబ్! భయపడిపోయింది హైమ. తాను అతన్ని పట్టించుకోనట్టుగానే పక్క పరుస్తూ ఉంది.

"మీరు చాలా అందంగా ఉన్నారు. అందుకే మా అన్నయ్య మిమ్మల్ని ఉంచుకోవాలనుకున్నాడు" అన్నాడు అయూబ్ ఆమె ఒంపుల్ని గమనిస్తూ. ఆ మాట తనకి కొరడా దెబ్బలా తగిలి చుర చుర చూసింది అయూబ్‌ని.

"అయామ్ సో సారీ. మీకు కోపం తెప్పించానా? అయినా, మీరు అతన్ని దరి చేరనీయలేదటగా. నాకు అంతా తెలుసు. మా అన్నయ్య చాలా మెత్తని మనిషి" అంటూనే హైమని వెనక నుంచి వచ్చి కౌగలించుకున్నాడు అయూబ్.

"వదలండి, వదలండి, నేనలాంటిదాన్ని కాదు" అంటూ పెనుగులాడింది హైమ.

"నువ్వు కాకపోవచ్చు. నేను మాత్రం అలాంటివాణ్ణే! ఇంత అందమైనదాన్ని వదులుకోడానికి నేను మా అన్నయ్యని కాదు" అంటూ మంచం మీదకి తోశాడు.

"రక్షించండీ" అంటూ గట్టిగా అరిచేసింది భయంతో హైమ.

ముసలావిడ ఉరుకుల పరుగులతో వచ్చి "రేయ్ వెధవా! బుద్ధుందా? ఎంత నీచుడివిరా" అంటూ అతని చెంపలు వాయించింది. దాంతో అయూబ్ అక్కడి నుంచి తప్పు చేసినవాడిలా తల వంచుకుని వెళ్ళిపోయాడు. ముసలావిడ ఎద మీద తల పెట్టుకుని ఏడ్చేసింది హైమ.

"నువ్వు చేజేతులా చేసుకున్న తప్పమ్మా! నువ్వు మా రహ్మాన్ని ఇష్టపడి ఉంటే ఈ దగుల్బాజీ వెధవ నిన్ను ఇట్లా బలవంతం చేయడానికి పూనుకునేవాడా! నువ్వు ఏడిస్తే కరిగిపోయేందుకు రహ్మాన్ కాదమ్మా! ఇప్పటికైనా అర్థం చేసుకో. నేను పెద్దదాన్ని. అన్నీ నీకు వివరంగా చెప్పకూడదు" అంది ముసలావిడ హైమ తల నిమురుతూ. రాత్రంతా ఏవేవో ఆలోచనలతో నిద్రపట్టలేదు హైమకి. ఉదయానికల్లా జ్వరం వచ్చేసిందామెకు. దుకాణానికి వెళ్ళాల్సిన రహ్మాన్ ఆ పూట వెళ్ళకుండా డాక్టరుని తీసుకువచ్చి చూపించాడు. దగ్గరే ఉండి మాత్రలు మింగించాడు. నిద్రలోనే ఉంది హైమ ఆ రోజంతా. ఎప్పుడైనా అరకొరగా మెలకువ వచ్చినప్పుడు రహ్మాన్, ముసలావిడ, పాప అక్కడే ఉన్నట్టు గమనిస్తోంది.

ఆ తర్వాతి రోజుకల్లా కోలుకుంది హైమ.

పెళ్ళయిన కొత్తలో తనకు మలేరియా జ్వరం వచ్చినప్పుడు పుట్టింటిలో వదిలి వచ్చాడు తన భర్త. ఆ తర్వాత తనకు కడుపు నొప్పి వచ్చినా, జబ్బు చేసినా ఏనాడూ పట్టించుకునేవాడు కాదు. అతనికి తాగుడు తప్ప మరో విషయం పట్టదు. తనకు తెలీకుండానే అరుణ్‌సింగ్‌నీ, రహ్మాన్‌నీ పోల్చి చూసుకుంటోంది హైమ.

తనకు తెలీకుండానే రహ్మాన్ వైపు మొగ్గు చూపుతోందా ? తనని ఎంతో ప్రేమిస్తున్న మనిషిని దూరం చేసుకుంటుందేమో? అయూబ్ చూపులు అనునిత్యం తనను వెంటాడుతూనే ఉన్నాయి. ఉదయం స్నానాల గది నుంచి హైమ వస్తోంటే అక్కడే నవ్వుతూ నిలబడి ఉన్నాడు అతను.

"హైమా! నిన్ను పొందని నా జన్మ ఎందుకూ? ఇక్కడి నుంచి నేను వెళ్ళేలోగా నా కోరిక తీర్చుకుంటాను. ఈ అయూబ్ అనుకున్నది జరగాల్సిందే" అనేసి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు అయూబ్.

తనను అయూబ్ నుంచి రక్షించుకోవాలంటే రహ్మాన్‌కి దగ్గరవ్వాల్సిందే! అట్లా నిశ్చయించుకున్న ఆ రాత్రే అయూబ్ చూస్తూ ఉన్నట్టే రహ్మాన్ గదిలోకి అడుగుపెట్టి తలుపు వేసింది హైమ.

అంతే -

ఆ రోజు నుంచి అయూబ్ ఆమెను చూడ్డం మానుకున్నాడు. ఆ తర్వాత రెండు రోజులకు అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

## 6

హైమకు ఇప్పుడు మూడో నెల.

కొత్త జీవితం ప్రారంభమైంది ఆమెకు.

ముసలావిడకు ఆ విషయం తెలిసినప్పటినుంచీ మరింత ఆత్మీయంగా చూస్తోంది హైమని. ఇక పాపతో అనుబంధం రోజురోజుకూ ఎక్కువయిపోతోంది.

ఆ వేళ మధ్యాహ్నం వరండాలో కూర్చుని ఉలన్‌తో స్వెట్టర్ అల్లుతోంది హైమ. పాప వచ్చి తన ఒడిలో తల ఆన్చి పడుకుని ఉంది. ముసలావిడ కొద్ది దూరంలో గోధుమల్ని చేస్తూ ఉంది.

"అక్కా! నీకో శుభవార్త" అంటూ పరిగెత్తుకు వచ్చింది సురేఖ.

"ఏమిటీ" అంది హైమ. సురేఖ అన్నిటికీ హడావిడి పడే పిల్లని ఆమెకు తెలుసు.

"చెప్పనా. నీకెంతో సంతోషాన్నిస్తుంది ఈ వార్త" అంటూ అక్కడే మెట్లపైన కూర్చుంది సురేఖ. ఉత్కంఠ రేపి తనని ఊరించాలని ఆ పిల్ల ఉద్దేశం అని అనుకుంది హైమ.

"అదేమిటో చెప్పవే! ఊరికే ఎందుకు ఊరిస్తావు" అంది ముసలావిడ.

"నానీమా! నీకయితే అది శుభవార్త కాదులే. హైమ అక్కకే అది శుభవార్త" అంది సురేఖ ఓరగంట హైమని గమనిస్తూ.

"అబ్బా! నీదంతా నాన్పుడు వ్యవహారమే సురేఖా! అదేదో తొందరగా చెప్పవే" అంది హైమ చిలిపిగా విసుక్కుంటూ.

"చెప్పనా! చెప్పేస్తున్నా. నువ్వు మీ దేశానికి వెళ్ళిపోతున్నావ్" అంది సురేఖ, హైమ కళ్ళలోకి చూస్తూ.

ఒక్కసారి షాక్ తగిలినట్టుగా సురేఖని చూసి, దిగులుగా కళ్ళు దించేసుకుంది హైమ. ముసలావిడ హైమనే చూస్తోంది ఆమెలో స్పందన ఏమిటోనని.

"ఎందుకక్కా అట్లా చప్పబడిపోయావు. ఈ విషయం వింటూనే నీ మొహం ఆనందంతో వికసిస్తుందనుకుని వస్తే" అంది సురేఖ నిరుత్సాహంగా.

"నేను వెళ్ళను. అవునూ, నీకీ విషయం ఎవరు చెప్పారే" అంటూ పొడిపొడిగా మాటాడింది హైమ.

"మా నాన్న చెప్పారు. ఈ రెండు దేశాలూ ఎత్తుకొచ్చిన ఆడవాళ్ళని తిరిగి ఎవరి దేశానికి వాళ్ళని పంపించాలని చా రోజులుగా మన రెండు దేశాలూ చర్చలు జరుపుతున్నాయిట. ఈ రోజు ఉదయానికి చర్చలు పూర్తయి ఒప్పందం పత్రాలపై సంతకాలు చేయడం కూడా జరిగిందట. అప్పుడే ఈ దేశంలోకి తెచ్చిన ఆడవాళ్ళ జాబితా కూడా సిద్ధమైంది. మిలట్రీ మేజర్ జావేద్ సాహేబ్ మా నాన్న ఫ్రెండేగా. ఆయన చూపించాడట ఆ జాబితాని. అందులో నీ పేరు రెండోదేనట. ఇప్పటికైనా నమ్ముతావా" అంది సురేఖ. ఇప్పుడైనా హైమ ఆనందిస్తుందేమోనని ఆశగా చూస్తూ.

హైమ మొహంలో మరింత దిగులు చోటు చేసుకుంది. యాంత్రికంగా ఉలన్‌తో అల్లిక సాగిస్తూనే ఉంది. పాపకు ఏమర్థమైందో ఏమో! దిగ్గున ఒళ్ళోంచి తలెత్తి "అమ్మా, నువ్వు మీ దేశానికి వెళ్ళిపోతావా" అంది బిక్కమొహం వేసుకుని.

పాప అట్లా అడుగుతుండగానే తలపై నిమురుతూ "ఊహూఁ వెళ్ళను మున్నీ" అంది హైమ. అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో నీళ్ళు పొంగాయి.

ముసలావిడకి ఆ విషయాలు మాట్లాడ్డం ఇష్టం లేనట్లు గోధుమల్ని డబ్బాలో పోసుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

సురేఖ అందాకా మెట్ల మీద కూర్చున్నదల్లా, హైమ పక్కన వచ్చి కూర్చుని, "నిజంగా వెళ్ళవాక్కా? నాకైతే నువ్వు ఇక్కడే ఉండాలంటేనే ఇష్టం. అక్కడ మీ దేశంలో మీ ఆయనా, మీ అమ్మా, నాన్న

అందరూ ఉన్నారు కదా. వాళ్ళతో హాయిగా ఉండొచ్చు కదా. సొంత దేశంలో ఎట్లయినా బతకొచ్చు" అంటోంది సురేఖ.

ఆ పిల్లకి ఎట్లా చెప్పాలో పాలుపోవడం లేదు హైమకి. ఆడదాని జీవితం మొగుడితో ముడిపడి ఉంటుందనీ, ఇన్నాళ్ళూ పరాయి దేశంలో, పరాయి మొగాడితో ఉన్న ఆడదాన్ని ఏ మొగుడూ ఏలుకోడనీ ఎట్లా చెప్పగలదు తాను.

" నా జీవితం కుక్కలు చింపిన విస్తరి అవుతుందమ్మా మా దేశానికి పోతే" అని మాత్రం అనగలిగింది.

సురేఖకి హైమ మాటలు ఏమీ అర్థం కాలేదు.

## 7

రాత్రి భోజనానికి కూర్చునప్పుడు తనకు వడ్డిస్తోన్న హైమనే చూస్తున్నాడు రహ్మాన్. ముభావంగా ఉంది హైమ.

"నీకూ వడ్డించుకో హైమా" అన్నాడు రహ్మాన్.

"ఊహూఁ నాకు ఆకలిగా లేదు" అంది హైమ పొడిగా.

"ఇవాళ ఒక్కరోజే మనం కలిసి భోంచేసేది. రేపు ఈపాటికి మీ ఇంట్లో, మీ వాళ్ళతో" అంటున్న రహ్మాన్ గొంతు గాద్గదికమైంది.

"మా దేశానికి వెళ్ళను. నాకు ఇక్కడే బావుంది" అని ఆమె అంటూంటే కళ్ళల్లో నీళ్ళు రాలిపడ్డాయి.

రహ్మాన్‌కి తినాలనిపించలేదు. వెంటనే చేతులు కడిగేసుకున్నాడు.

"నన్ను ఇక్కడే ఉండనివ్వండి. అక్కడికి వెళ్ళలేను" అంటూ అతనిపై వాలిపోయి ఏడ్చేసింది హైమ.

"తప్పదు హైమా. ఇది నీకూ, నాకూ మధ్య జరుగుతున్న విషయం కాదు. మన రెండు దేశాల మధ్య జరిగిన ఒప్పందం".

"నా మొదటి బిడ్డని మీ వాళ్ళు పొట్టన పెట్టుకున్నారు. ఇప్పుడు పుట్టబోయే బిడ్డతో ఇక్కడ బతకొచ్చు అనుకుంటూ ఉంటే మా దేశానికి పంపించేయాలంటున్నారు. పుట్టబోయే బిడ్డ తన ద్వారా కలుగుతున్న సంతానం కాదని తెలిసిన భర్త నన్ను ఎట్లా ఏలుకుంటాడు? అసలు మా ఇద్దర్నీ క్షేమంగా ఉండనిస్తాడా అని నా అనుమానం" అంటూ వలవలా ఏడ్చేసిందామె.

ఆమె మాటలకి ఏం సమాధానం చెప్పాలో తెలీక మౌనంగా ఆమె వీపు మీద సుతారంగా తడుతూ ఉండిపోయాడతను.

"మీకు దేశాల గొడవలేనా? దేశంలో ఆడవాళ్ళుంటారు, వాళ్ళకి ఆత్మాభిమానాలూ, ఇష్టాలూ ఉంటాయని మీకు అనిపించవా?" అని సూటిగా అతని వైపు చూస్తూ అంది హైమ.

మౌనంగా కన్నీళ్ళతో చూశాడు రహ్మాన్ ఆమెని.

"నువ్వయినా నన్ను ఇక్కడే ఉండిపోయేలా చేయలేవా" అంది చేతుల్ని ప్రాథేయపూర్వకంగా

పట్టుకుంటూ.

"అది వీలు కాదు హైమా" అని మాత్రం అనగలిగాడు రహ్మాన్.

"ఏది ఏమైనా నేను వెళ్ళను గాక వెళ్ళను. నాకు ఏ దేశమూ వద్దు. నేనూ, నా పుట్టబోయే బిడ్డా బతకడానికి ఇంత అవకాశం కల్పించుకుంటాను" అందామె మొండిగా శూన్యంలోకి చూస్తూ. అది వీలయ్యే పని కాదని ఆమెకీ తెలుసు. కానీ, తన ఉద్దేశం అది.

"రేపు ఉదయమే మిలటరీ సైనికులు వచ్చి నిన్ను తీసుకువెళుతున్నారు హైమా" అని అంటున్న అతని గొంతు పూడిపోయింది.

రహ్మాన్ లేచి పక్కలు వేశాడు. యాంత్రికంగా మంచం మీద పడుకుంది హైమ. ఆమెని మాట్లాడిస్తే ఇంకా బాధపడుతుంది. తననీ బాధ పెడుతుందని గమ్మున ఉండిపోయాడు రహ్మాన్.

హైమ తలలో ఏవో ఆలోచనలు.

తాను తన దేశాన్ని ప్రేమించడం లేదా? తనకు దేశమంటే భర్తేనా?

సురేఖ అన్నట్టు స్వదేశంలో ఎట్లాగయినా బతకొచ్చా.

దేశమంటే మనుషులూ, జంతువులూ, కొండలూ, కోనలూ, చెట్లూ, పుట్టలేనా? తనవాళ్ళూ, తనని అభిమానించేవాళ్లూ, తనని ఆత్మీయంగా చూసేవాళ్ళూ, తన ఉనికిని నిరంతరం గుర్తించేవాళ్ళూ లేని దేశం తన దేశం ఎట్లా అవుతుంది.

తానూ, తన సంతానం గౌరవంగా, సగర్వంగా బతకడానికి వీలుకానప్పుడు తాను ఏ దేశానికీ సంబంధించని మనిషిగా ఉంటేనేం? ఈ దేశంలో కనీసం తనంటే ఇష్టపడే రహ్మాన్, మున్నీ, ముసలావిడ అయినా ఉన్నారు. ఇప్పుడు తన దేశంలో? తనకు తానే ఒక పెద్ద ప్రశ్నార్థకమవుతోంది ఆలోచించే కొద్దీ.

❀❀❀

మరుసటిరోజు ఉదయమే సైనికులు వచ్చారు రహ్మాన్ ఇంటికి. రహ్మాన్ హైమను వాళ్ళకు అప్పగించాడు. మిలటరీ వ్యాను ఎక్కుతూ ఉంటే రహ్మాన్ చూపు ఆమెను నిలువెల్లా కంపింపచేసింది. ఇక పాప, "అమ్మా! నీతో నేనూ వస్తా, నన్నూ తీసికెళ్ళమ్మా" అంటూ ఒకటే ఏడుపులు. ముసలావిడ కన్నీళ్ళతో చూస్తోంది హైమ వైపు. ఇదంతా చూస్తోంటే వ్యానులోంచి దూకేద్దామా అనిపించింది. 'ఊహూఁ. తాను దూకేసినా రహ్మాన్ ఒప్పుకోడు. అది తనకు తెలుసు'. కన్నీళ్ళు పొంగడంతో వాళ్ళ ఆకారాలు మసకబారాయి.

వ్యాను ముందుకు కదిలింది. తక్కిన ఆడవాళ్ళని తీసుకువెళ్ళడానికి.

## 8

అప్పటికి మిట్ట మధ్యాహ్నం అయినందువల్ల ఎండవేడిమి కొంత ఎక్కువగానే ఉంది.

ఆడవాళ్ళను తీసుకువెళుతున్న అయిదు పాకిస్తాన్ మిలటరీ ట్రక్కులు కొండల మధ్య వరుసగా ప్రయాణిస్తున్నాయి - మొదటి విడతగా.

మొదటి ట్రక్కులో ఇరవై అయిదు మంది ఆడవాళ్ళు కూర్చుని ఉన్నారు. వాళ్ళలో హైమా, రజనీలు రెండో వరుసలో పక్కపక్కనే కూర్చుని ఉన్నారు. వాళ్ళందర్లోనూ తమ మాతృదేశానికి వెళ్ళిపోతున్నామన్న ఉత్సాహం కానీ, ఆనందం కానీ, ఉద్వేగం గానీ లేవు.

అందర్లోనూ ఒకటే ఆందోళన. తమ దేశంలో, తమ ఊర్లో తమ భర్తలూ, తమ తల్లిదండ్రులూ, బంధువులూ తమని సంతోషంగా స్వీకరిస్తారా? ఒకవేళ స్వీకరించకపోతే తమ పరిస్థితి ఏమిటి? తాము ఏమైపోవాలి?

రజని, హైమ భుజం మీద వాలిపోయి ఏడుస్తుంటే హైమ అంది. "నేను బాధపడడంలో అర్థముంది రజనీ! నువ్వు బాధపడ్డంలో అర్థం లేదు. నరకకూపం లాంటి చోటు నుంచి విముక్తి కలిగినందుకు సంతోషించు!"

"నీ బాధ వేరు, నా బాధ వేరు హైమా" అంది రజని కళ్ళు తుడుచుకుంటూ.

"ఎలా, ఏదీ చెప్పు" అంది హైమ. వేరొకరితో తమ బాధ చెప్పుకుంటే అప్పటివరకూ ఉన్న బాధ కొంత తగ్గుతుందనీ తెలుసు ఆమెకి అందుకే అలా అంది.

"నాకు పెళ్ళయి పదేళ్ళు గడిచినా సంతానం కలగలేదు. నేను గొడ్రాలినని నా భర్త రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఆ రెండో పెళ్ళానికీ సంతానం కలగలేదు. ఎట్లా కలుగుతుంది. అసలు మేము గొడ్రాళ్ళం కాదు. వాడు గొడ్డు వెధవ! ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకున్నా ఎట్లా పుడతారు పిల్లలు? ఆ తర్వాత మూడో పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నాలు చేశాడు. అప్పట్లో నాకు పిల్లలు కలగనందుకు ఎంతగానో కుమిలిపోయేదాన్ని. ఎన్ని దేవుళ్ళకు మొక్కుకున్నానో. అయినా, ఫలితం లేకపోయింది. ఇప్పుడు నేను కడుపుతో ఉన్నాను. నన్ను ఒప్పుకున్నా, నా కడుపును ఒప్పుకుంటాడా? ఊఁహూఁ ఒప్పుకోడు హైమా, ఒప్పుకోడు. నా కడుపును ఎలాగయినా తీయించేస్తాడు. ఈ దేశంలో ఉండి ఉంటే నరకం లాంటి ఆ ఇంట్లో కనీసం నా బిడ్డని నేను చూస్తూనయినా బతికేదాన్ని. నా బిడ్డ లేంది నేను బతికి ఏం లాభం హైమా? నాకు ఏ దేశమూ వద్దు. నా బిడ్డ నాక్కావాలి" అంటోంది రజని, ఏడుస్తూనే తన కడుపుపై ప్రేమగా నిమురుకుంటూ.

మాతృత్వం, మాతృదేశాన్ని కూడా లెక్క చేయడం లేదు. తన పరిస్థితి కూడా అదే అనుకుంది హైమ.

ట్రక్కు గమ్యం చేరుకోవడానికి వేగంగా కదిలిపోతోంది. పాకిస్తాన్ సరిహద్దు దాటి భారత భూభాగంలోకి ప్రవేశించింది.

## 9

భారత సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆ మిలటరీ క్యాంపు చాలా రద్దీగా ఉంది. అప్పటికి పాకిస్తాన్ నుంచి ఈ దేశానికి బలవంతంగా పట్టుకుని వచ్చిన ఆడవాళ్ళని ఆ దేశానికి తరలించడం జరిగిపోయింది. పాకిస్తాన్‌కు బలవంతంగా తీసుకుపోయిన ఆడవాళ్ళనూ, వాళ్ళ గురించిన వివరాలున్న జాబితాని ఇక్కడి మిలటరీ అధికారులకు చేర్చి వెళ్ళారు. వాళ్ళు ఏ ఏ ప్రాంతానికి చెందినవాళ్ళో కూడా ఆ

జాబితాలో పొందుపరిచి ఉంది.

ఆ ఆడవాళ్ళని తీసుకువెళ్ళడం కోసం వాళ్ళ భర్తలూ, తల్లిదండ్రులూ, బంధువులూ వచ్చారు. ఆ వచ్చినవాళ్ళలో తమ కూతురూ, తమ కోడలూ, తమ చెల్లెలూ తిరిగివచ్చిందన్న ఆనందోత్సాహాలు మచ్చుకైనా లేవు.

తప్పదు కనుక తీసుకుపోవాల్సి వస్తోంది అన్నట్టుంది వాళ్ళ తీరు.

తన భర్త అరుణ్‌సింగ్ ఏమైనా వచ్చాడేమోనని అన్ని వైపులా కలయచూసింది హైమ. వంద గజాల దూరంలో ఉన్న గుంపులో అరుణ్‌సింగ్ కూడా నిలుచుని ఉన్నట్టు గమనించింది. అతని పక్కనే ఒకామె చాలా దగ్గరగా నిలుచుని ఉండడం చూసి ఆమే తన స్థానాన్ని ఆక్రమించిన రెండవ భార్య అయి వుంటుందనీ అనుకుంది.

"అమ్మా హైమా!" అంటూ పలకరించిన వైపు తిరిగి చూసింది. తన తండ్రి నిలుచుని ఉన్నాడు. తల్లి మెల్లగా అడుగులు వేస్తూ అక్కడికి చేరుకుంది. హైమని చూస్తూనే తల్లికి దుఃఖం ఆగలేదు. కూతుర్ని కౌగలించుకుని ఏడ్చేసింది. "ఎన్ని కష్టాలు వచ్చాయే నా తల్లీ' అంటూ.

"అమ్మా! ఆయన రెండో పెళ్ళీ..." అడిగింది హైమ.

"అవునమ్మా" అంది తల్లి నిర్లిప్తంగా.

మిలటరీ అధికారులు హైమని తండ్రికి అప్పగించినట్టు సంతకాలు పెట్టించుకున్నాక, మిలటరీ క్యాంపస్ దాటి బయటికొచ్చారు. అప్పటికే అరుణ్‌సింగ్ అక్కడ లేడు.

"మనింటికి వెళ్దామా నాన్నా" అంది హైమ. తన భర్త ఇంటికి వెళ్ళడానికి వీలున్నదీ, లేనిదీ తండ్రి చెబుతాడని ఆమె ఉద్దేశం. ఇంతలో ఓ గుర్రపు బండి అటుగా వస్తే నిలిపాడు హైమ తండ్రి.

"లేదమ్మా" అన్నాడతను హైమతో. గుర్రపు బండిలోకి హైమని ఎక్కించి తల్లీ, తండ్రీ వెనకాల వైపు కూర్చున్నారు.

"మరయితే మా ఇంటికా" అంది కొంచెం ఉత్సాహంగా.

గుర్రపు బండి ముందుకు సాగింది మెల్లగా.

"కాదమ్మా. ముందుగా ఆస్పత్రికి వెళ్ళాలి" అంది హైమ తల్లి తలయినా ఎత్తకుండానే.

"నాకేమయిందమ్మా. బాగా ఉన్నానే!" అంది అమాయకంగా హైమ.

"నీకు నెల తప్పినట్టు నీ రికార్డులో తెలిపారమ్మా పాకిస్తాన్ మిలటరీ వాళ్ళు. అందుకే అబార్షన్ చేయించేందుకు" అంది తల్లి ఎటో చూస్తూ.

తల దిమ్మెక్కిపోయింది హైమకి. పిచ్చిగా తల్లివైపు చూస్తూ "అమ్మా, నా రెండో బిడ్డని కూడా నాకు దక్కనియ్యరా" అంది గట్టిగా కీచుపోతున్న కంఠంతో.

తల్లి కళ్ళలో నీళ్ళు టప టప రాలిపడుతున్నాయి.

గుర్రపు బండి ఆస్పత్రి వైపు వేగంగా పోతోంది.

– ఇండియా టుడే, 28 సెప్టెంబరు 1999, 5 అక్టోబర్ 1999